సాక్షి వరంగల్

శనివారం । 25 । మార్చి । 2023



పట్టు పరిశ్రమకు తెలంగాణ..

పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. - 8లో▸



'గజ్జల' గ్రంథాలయం..

కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ఆచార్యులు గజ్జల రామేశ్వరం. ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాల భాండాగారాన్ని ఏళ్లు శ్రమించి నిర్మించారు. - 8లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం $36^0/25^0$

జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పాక్షికంగా ఎండగా ఉంటుంది. పొడి వాతావరణంతోపాటు రాత్రిపూట చల్లగా ఉంటుంది.

ఇఫ్తార్	సహర్
శని 6:34	ఆది 4:54

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

నేడు ప్రత్యేక గ్రీవెన్స్

కాశోజీ సెంటర్: కలెక్టర్ కార్యాలయంలో దివ్యాంగులు, వయో వృద్ధులకు శనివారం ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహించనున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మాచర్ల శారద ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ నెల నాల్గవ శనివారం గ్రీవెన్స్ ఉంటుందని, అందులో భాగంగా ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వినతిపత్రాలు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

190 మంది గైర్హాజరు



కాశోజీ సెంటర్: జిల్లాలో శుక్రవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 190 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని డీఐఈఓ కాక మాధవరావు తెలిపారు. 27 కేంద్రాల్లో 5,008 మంది పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా.. 4,818 మంది రాసినట్లు పేర్కొన్నారు. జనరల్ కోర్సుల్లో 131, ఒకేషనల్ కోర్సుల్లో 59 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు తెలిపారు.

అదనపు కలెక్టర్, డీడబ్ల్యూఓపై సీఎస్‌కు ఫిర్యాదు

కాశోజీ సెంటర్: తనపై కలెక్టర్‌కు తప్పుడు సమాచారం ఇచ్చి.. డీసీపీఓ పోస్టు నుంచి తొలగించారని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి సంబంధిత అధికారులైన అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, డీడబ్ల్యూఓ శారదపై చర్య తీసుకోవాలని ఆ పోస్టు నుంచి రిలీవ్ అయిన గాదె మహేందర్‌రెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. వేధింపులకు గురిచేస్తున్నారంటూ తనపై క్రిమినల్ కేసు పెట్టించి.. శాశ్వతంగా ఉద్యోగంలోకి రాకుండా ప్రణాళికతో తనను బలిపశువును చేశారని ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి సంబంధిత అధికారులపై చర్య తీసుకోవాలని కోరినట్లు తెలిపారు.

లక్ష్యాలను పూర్తి చేయాలి



వరంగల్ రూరల్: ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. శుక్రవారం ఆమె రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 86.5 లక్షల మందికి కంటి పరీక్షలు నిర్వహించి.. 14.23 లక్షల మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామని తెలిపారు. మహిళా దినోత్సవం సందర్భంగా ప్రారంభించిన ఆరోగ్య మహిళ కేంద్రాలపై మరింత విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. పోడు భూముల పట్టాల పంపిణీ త్వరలోనే ప్రారంభమవుతుందని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని చెప్పారు. ఏప్రిల్ 3 నుంచి 13 వరకు జరిగే పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. వీసీలో కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ బృహత్ పల్లె ప్రకృతి వనాలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేసే దిశగా పనులను వేగవంతం చేస్తామని చెప్పారు. వీసీలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీవత్స కోట, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీఈఓ డి.వాసంతి, డీపీఓ కె.కల్పన, డీటీడీఓ జహీరుద్దీన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

అవినీతి నుంచి అభివృద్ధిలోకి డీసీసీబీ

సాగులో ఆధునిక పద్ధతులు పాటించాలి

విద్యార్థి ఉద్యమకారుల సంఘర్షణ సభ వాయిదా

గుణాత్మక సమాచారం సేకరించాలి

- వివరాలు 10లో▸

సర్వే షురువైంది..

- సీఎం కేసీఆర్ ఆదేశాలతో రంగంలోకి వ్యవసాయ, రెవెన్యూ శాఖలు
- ఇప్పటికే ప్రాథమికంగా 57,855 ఎకరాల్లో నష్టం జరిగినట్లు అంచనా
- క్షేత్రస్థాయి సర్వే పూర్తయితే పంట నష్టం మరింత పెరిగే అవకాశం
- ఎకరానికి రూ.10వేల చొప్పున చెల్లించనున్న సర్కార్



ఖానాపురం మండలంలో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

సాక్షి, వరంగల్: జిల్లాలో ఇటీవల కురిసిన అకాల, వడగళ్ల వానతో దెబ్బతిన్న మిర్చి, మొక్కజొన్న, టమాట తదితర పంటల నష్టాన్ని అంచనా వేయడంపై వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు దృష్టి సారించారు. దుగ్గొండి మండలం అడవిరంగాపురంలో దెబ్బతిన్న పంటలను గురువారం పరిశీలించిన సీఎం కేసీఆర్.. జిల్లాలో ఎన్ని ఎకరాల్లో పంటలు ధ్వంసమయ్యాయనే పూర్తి వివరాలను క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు రూపొందించాలని కలెక్టర్ ప్రావీణ్యను ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ ఆదేశాల మేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు పంటలు దెబ్బతిన్న మండలాల్లో పర్యటిస్తున్నారు. ముఖ్యంగా గీసుకొండ, దుగ్గొండి, సంగెం, నెక్కొండ, చెన్నారావుపేట, నల్లబెల్లి, నర్సంపేట, పర్వతగిరి, వర్ధన్నపేట, రాయపర్తి, ఖానాపురం, ఖిలా వరంగల్, వరంగల్ మండలాల్లో మొక్కజొన్న 48,101 ఎకరాల్లో 37,056 మంది రైతులు నష్టపోయినట్లు ప్రాథమిక నివేదికలో తేల్చారు. ఈ నష్టాన్ని కచ్చితంగా తెలుసుకోవడంతోపాటు పరిహారం పకడ్బందీగా అందించాలన్న ఉద్దేశంతో ఆయా మండలాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పంట నష్టం వివరాలను నమోదు చేసుకుంటున్నారు. ఇంకోవైపు 9,450 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేసిన అధికారులు వీటి లెక్కలను కూడా క్షేత్రస్థాయిలో తేల్చే పనిలో పడ్డారు. ఇతర పంటలైన పత్తి, మిర్చి, మామిడి, వేరుశనగ తదితర పంటల వివరాలను కూడా సేకరిస్తున్నారు. అయితే సీఎం కేసీఆర్ పర్యటనకు ముందు జిల్లావ్యాప్తంగా 57,855 ఎకరాల్లో వివిధ పంటలు వేసిన 43,423 మంది రైతులు నష్టపోయారని ప్రాథమికంగా తేల్చారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు భావిస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా సర్వే పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తే రైతులకు ఎకరానికి రూ.10వేల చొప్పున వారి ఖాతాల్లో జమ కానుంది.

కౌలు రైతులకు కష్టకాలమే..

తక్కువ భూమి ఉన్న రైతులతోపాటు అసలు భూమి లేనివారు కొంత భూమిని కౌలుకు తీసుకొని మొక్కజొన్న, వరి సాగు చేస్తున్నారు. అయితే ఈ పంటలు కూడా వడగళ్ల వానకు దెబ్బతిన్నాయి. పట్టాదారు పాస్‌బుక్‌ను ఆధారంగా చేసుకుంటే వీరు అసలైన రైతులు కాదు. ఇక్కడే చిక్కుముడి వచ్చి పడింది. వీరి లెక్కలు కూడా తేల్చాలని కలెక్టర్ ప్రావీణ్యను ఆదేశించడంతో కౌలు రైతుల వివరాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అయితే వీరికి పరిహారం ఎలా చెల్లిస్తారన్నది వేచి చూడాలి. అసలైన రైతులతో మాట్లాడి వారి ఖాతాల్లో డబ్బులు జమ అయ్యాక వీరికి చెల్లించమంటారా.. లేదంటే ప్రత్యేక ఖాతాల ద్వారా వీరికి చెల్లిస్తారా.. అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే సీఎం కేసీఆర్ కౌలు రైతుల కష్టాలను చూసి వారికి న్యాయం జరిగేలా చూడాలని కలెక్టర్‌ను ఆదేశించడంతో వీరికి పరిహారం వస్తుందన్న ఆశతో ఎదురుచూస్తున్నారని అధికారులు అంటున్నారు.

దెబ్బతిన్న వరిని పరిశీలించిన శాస్త్రవేత్తలు

ఖానాపురం: తుంగబంధం, రాగంపేట, ఖానాపురం, మంగళవారిపేట గ్రామాల్లో ఇటీవల వడగళ్ల వానతో నష్టపోయిన వరి పంటలను శాస్త్రవేత్తల బృందం శుక్రవారం పరిశీలించింది. హైదరాబాద్ రాజేంద్రనగర్ డైరెక్టర్ ఆఫ్ రైస్ రీసెర్చ్ సంస్థకు చెందిన తెగుళ్ల శాస్త్రవేత్త కృష్ణవేణి, సస్యరక్షణ శాస్త్రవేత్త శ్రీదేవి, కీటక శాస్త్రవేత్త పద్మావతి, ప్లాంట్ బ్రీడింగ్ శాస్త్రవేత్త జి.పద్మావతి పంటలను పరిశీలించి.. వివరాలు సేకరించారు. వడగళ్లతో దెబ్బతిన్న పంటలు పని చేస్తాయా.. లేదా.. అనే విషయాన్ని తెలుసుకున్నారు. నాలుగు గ్రామాల్లో పంటలు ఎంతమేర నష్టపోయాయనే విషయాన్ని నిశితంగా పరిశీలించారు. గుళికలు, డీఏపీ వేస్తే పిలక వస్తుందని, పంటలో దోమ ఉందని శాస్త్రవేత్తలు రైతులతో చర్చించడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలతో పంటలన్నీ దెబ్బతిన్నాయని, డీఏపీ వేస్తే ఎలా పని చేస్తుందని రైతులు ఎదురు ప్రశ్నించారు. దీంతో శాస్త్రవేత్తలు రైతుల వద్ద వివరాలన్నీ నమోదు చేసుకున్నారు. పరిహారంపై ప్రభుత్వానికి త్వరలోనే నివేదించనున్నట్లు తెలిపారు. వారి వెంట ఆర్‌బీఎస్ కన్వీనర్ కుంచారపు వెంకట్‌రెడ్డి, ఏఈఓ సంధ్య, రైతులు రెడ్డి నాగార్జున్‌రెడ్డి, అశోక్, గంధ్రాతి శ్రీనివాస్, శ్యాం, ప్రసాదరావు, యడ్ల భిక్షంరెడ్డి, శ్రీనివాసరావు, నవీన్ ఉన్నారు.

సాక్షి 15వ వార్షికోత్సవం



సాక్షి దినపత్రిక పురుడు పోసుకుని 15ఏళ్లు పూర్తయిన సందర్భంగా వరంగల్ యూనిట్ కార్యాలయంలో శుక్రవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, రిపోర్టర్లు, సిబ్బంది కలిసి భారీ కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సాక్షిలో తమ ప్రయాణాన్ని మననం చేసుకున్నారు.

ఆదాయ పన్ను చెల్లింపుపై అవగాహన ఉండాలి

- నగర మేయర్ గుండు సుధారాణి



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేయర్ సుధారాణి

వరంగల్ చౌరస్తా: ఆదాయ పన్ను, టీడీఎస్, జీఎస్టీలపై వ్యాపారులు అవగాహన కలిగి ఉండాలని నగర మేయర్ గుండు సుధారాణి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హంటర్ రోడ్డు సాయినగర్‌లో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా వరంగల్ ఆధ్వర్యంలో వ్యాపార, వాణిజ్యవేత్తలకు ఆదాయ పన్నుపై జరిగిన అవగాహన సదస్సును ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బ్రాంచ్ ద్వారా విద్యార్థులు, గుమస్తాలకు శిక్షణ ఇవ్వడం వల్ల అకౌంట్స్‌లో నైపుణ్యాలు పెంపొందుతున్నాయన్నారు. రిటైర్డ్ ఆదాయ పన్ను శాఖ కమిషనర్ సీహెచ్.ఓంకారేశ్వర్.. వ్యాపారుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ గందె కల్పన, ముఖ్యులు గరికపాటి అరవింద, వేదప్రకాశ్, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ గోపీచంద్, వరంగల్ బ్రాంచ్ చైర్మన్ రాయబారపు హరికృష్ణ, వైస్ చైర్మన్ భగవాన్‌దాస్ ముందడా, వరంగల్ సికాస చైర్మన్ మాదారపు సుజిత్, కోశాధికారి మన్నెం రామకృష్ణ, ఫాస్ట్ చైర్మన్ ప్రదీప్ చందర్, కార్యదర్శి సత్యనారాయణ పూజారి పాల్గొన్నారు.

జీఎంహెచ్‌లో ప్రతిరోజూ టీకా సేవలు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి(జీఎంహెచ్) ఆవరణలోని పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రంలో ఇకనుంచి ప్రతి రోజూ (ఆదివారం మినహా) పిల్లలు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు అందించనున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ బి.సాంబశివరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం కేంద్రంలో ప్రత్యేక టీకా వైద్య సేవలను ఆయన ప్రారంభించారు.

దమ్ముంటే పరిహారం ఎక్కువ తీసుకురా..

- 'బండి'కి సవాల్ విసిరిన ఎమ్మెల్యే పెద్ది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట: సీఎం కేసీఆర్ ఇస్తున్న పంట నష్టపరిహారం సరిపోవడం లేదంటున్న బండి సంజయ్‌కి దమ్ముంటే కేంద్రం నుంచి ఎక్కువ పరిహారం తీసుకురావాలని నర్సంపేట ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సవాల్ విసిరారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర విధానాలతోనే పంట ఉత్పత్తుల ధరలు తగ్గుముఖం పడుతున్నాయన్నారు. సీసీఐని నిర్వీర్యం చేస్తుండడంతోనే పత్తి ధర పతనమైందన్నారు. వ్యవసాయం వదిలిపెట్టి.. రైతులను, భూమిని వేరు చేయాలని చూసే పార్టీయే బీజేపీ అని అన్నారు. రేవంత్‌రెడ్డి, బండి సంజయ్‌ల జెండాలు వేరు అయినప్పటికీ ఎజెండాలు మాత్రం ఒక్కటేనన్నారు. ఎన్‌డీఆర్ఎఫ్ నిధులు రూ.1,816కోట్లు విడుదల చేస్తే.. ఎన్నికలు జరిగే ఐదు రాష్ట్రాలకు మాత్రమే ఇచ్చారని, తెలంగాణకు పైసా కూడా ఇవ్వలేదన్నారు. మీడియాలో వార్తల కోసం పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని, రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ నర్సంపేటకు వస్తే నష్టం ఎంత జరిగిందో మీకే తెలుస్తుందన్నారు. పది వేల పీవీసీ పైపుల యూనిట్లను, 10వేల టార్పాలిన్ యూనిట్లను సబ్సిడీ రూపంలో రైతులకు అందజేయాలని సీఎం వెల్లడించారని తెలిపారు. నియోజకవర్గ వ్యాప్తంగా 32,193 ఎకరాల్లో వివిధ రకాల పంటలకు నష్టం జరిగినట్లు తెలిపారు. సమావేశంలో రైతుబంధు రాష్ట్ర సభ్యుడు రాయిడి రవీందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణగౌడ్, బీఆర్ఎస్ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి, లెక్కల విద్యాసాగర్‌రెడ్డి, గుంటి కిషన్, మండల శ్రీనివాస్, వేణుముద్దల శ్రీధర్‌రెడ్డి, పుట్టపాక కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రెండేళ్లలో లక్ష మందికి ఉపాధి

- పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



ప్లాస్టిక్ బాటిళ్లను కరిగించి గుళికలు తయారు చేసిన విధానాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చల్లా

సంగెం/గీసుకొండ: వచ్చే రెండేళ్లలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో లక్ష మందికి ఉపాధి లభిస్తుందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. శుక్రవారం సంగెం, గీసుకొండ మండలాల పరిధి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీల స్థాపన కోసం పోటీపడి వస్తున్నారని, రాష్ట్ర ప్రభుత్వంతో 20 కంపెనీలు ఎంఓయూ కుదుర్చుకున్నాయన్నారు. ప్రస్తుతం గణేశా, ఏకో పెట్ రెండు కంపెనీలు ప్రారంభమయ్యాయన్నారు. ఇందులో 750 మందికి ఉపాధి లభించిందన్నారు. కైటెక్స్ కంపెనీ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని, పూర్తయితే నెలకు రూ.17,500 వేతనంతో 11 వేల మందికి ఉపాధి లభిస్తుందని తెలిపారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుకు వస్తున్న పేరు చూసి తట్టుకోలేకనే కూరలో ఉప్పు వేసి పొత్తు అన్న చందంగా కేంద్రం పీఎం మిత్ర కింద ఎంపిక చేసిందని ధర్మారెడ్డి ఎద్దేవా చేశారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, సంగెం, గీసుకొండ జెడ్పీటీసీలు సుదర్శన్‌రెడ్డి, పోలీసు ధర్మారావు, సర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు సాగర్‌రెడ్డి, గణేశా కంపెనీ ప్రతినిధి రాకేశ్, వరంగల్ మార్కెట్ మాజీ చైర్మన్ చింతం సదానందం, బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు వీరగోని రాజ్‌కుమార్, చల్లా వేణుగోపాల్‌రెడ్డి, దుర్గాశక్తి మల్టీ మెగా టెక్స్‌టైల్ ప్రెసిడెంట్ కుమారస్వామి, సర్పంచ్‌లు ప్రకాశ్, నాగేశ్వర్‌రావు, జయపాల్‌రెడ్డి, మల్లారెడ్డి పాల్గొన్నారు.

రేపు పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం




సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్

నర్సంపేట: ఖిలా వరంగల్‌లోని అన్నపూర్ణ ఫంక్షన్ హాలులో ఈనెల 26న జరిగే పీడీఎస్‌యూ ఉమ్మడి వరంగల్ జిల్లా పూర్వ విద్యార్థుల సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎలకంటి రాజేందర్ కోరారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం పీడీఎస్‌యూ ప్రస్తుత, పూర్వ విద్యార్థుల ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ సమ్మేళనానికి 1970 నుంచి 2008 వరకు పీడీఎస్‌యూ విప్లవ విద్యార్థి ఉద్యమంలో పని చేసిన నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు, జిల్లా నాయకులు ఈరెల్లి మల్లేష్, కందికొండ లవకుమార్, ల్యాదల్ల రాజు, మంతెన రవి, అలువాల నరేష్, గుర్రం అజయ్, డివిజన్ అధ్యక్షుడు ఆబర్ల విక్రమ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

ఎల్లుగ్గార్‌గుట్టకు ఎసరు!

- మట్టి మాఫియా కన్నుపడి కరిగిపోతున్న గుట్ట
- కనుమరుగు కానున్న ప్రకృతి వారసత్వ సంపద
- ఆలయాలూ ఆనవాళ్లు కోల్పోయే పరిస్థితి
- తవ్వకాలు చేపట్టొద్దని స్థానికుల ఆందోళన



చిట్టడవిని తలపిస్తున్న ఎల్లుగ్గార్ గుట్ట



గతంలో మొరం తవ్వకాలు చేపట్టిన ప్రాంతం

సంగెం: ప్రకృతిసిద్ధంగా వెలిసిన గుట్ట.. వన్యప్రాణులకు నెలవుగా.. ఆలయాలతో విలసిల్లుతోంది. కాకతీయుల కాలం నాటి కట్టడాలు, ఏడు కోనేరులు, లక్ష్మీనర్సింహస్వామి, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలు కలిగి ఉండి ఆధ్యాత్మిక కేంద్రంగా బాసిల్లుతోంది. అలాంటి గుట్టను మరింత అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాల్సి ఉండగా.. మొరం మాఫియా కన్నుపడి చిక్కి శల్యమవుతోంది. రోజురోజుకూ కరిగిపోతున్న గుట్టను చూసి స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఎల్లుగ్గార్‌రంగంపేట రెవెన్యూ శివారు సర్వే నం.746లో ఇటీవల అశ్వత్థామ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ వారు 3.2 హెక్టార్లలో మొరం తవ్వకాలకు అనుమతి కోసం నర్సానగర్ గ్రామపంచాయతీ తీర్మానం కావాలని కోరారు. దీంతో ఎల్లుగ్గార్‌రంగంపేట, ఎల్లుగ్గార్‌స్టేషన్, నర్సానగర్, తిమ్మాపూర్ తదితర గ్రామాల ప్రజల్లో ఆందోళన మొదలైంది. ఎల్లుగ్గార్ గుట్ట కారణంగానే ఎల్లుగ్గార్‌రంగంపేట, ఎల్లుగ్గార్‌స్టేషన్‌తోపాటు ఎల్లుగ్గార్ రైల్వే స్టేషన్‌కు పేరొచ్చింది. సుమారు 153 ఎకరాల్లో విస్తరించి ఉన్న గుట్టపై పలు రకాల పండ్లు, పూలు, ఔషధ, నీడనిచ్చే వృక్షాలు వేల సంఖ్యలో ఉన్నాయి. కోతులు, నక్కలు, తోడేళ్లు, ఏదులు, అడవి పందులు, నెమళ్లు, ఎన్నో రకాల పక్షులు ఆవాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. ఇలాంటి గుట్టపై మట్టి తవ్వకాలకు అనుమతి కోరడం ఏమిటని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తూ ప్రశ్నిస్తున్నారు.

రెచ్చిపోతున్న మట్టి మాఫియా..

ఇప్పటికే చెరువులు, కుంటలు, ఎస్సారెస్పీ కెనాల్ కట్టల మట్టిని తరలిస్తున్న మట్టి మాఫియా కన్ను గుట్టపై పడింది. దీంతో గుట్టను కొందరు తవ్వుతూ నామరూపాలు లేకుండా చేయాలని చూస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గుప్త నిధుల కోసం గుట్టపై, చుట్టూ పలుమార్లు గుర్తు తెలియని దుండగులు తవ్వకాలు చేపట్టిన విషయం విదితమే. ఇప్పుడు మొరం తవ్వకాలు చేపట్టడం కూడా గుప్త నిధుల కోసమే అయి ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కొందరు ప్రజాప్రతినిధులు, అధికారుల అండతో గుట్ట చుట్టూ మొరం తవ్వకాలకు అనుమతి ఇవ్వాలని సర్పంచ్‌కు రూ.50వేలు, వార్డు సభ్యులకు రూ.5వేల చొప్పున ఇచ్చేందుకు మాఫియా ఆశ చూపుతోందనే ఆరోపణలు వస్తున్నాయి. కొందరు పెద్దల అండతో టెక్స్‌టైల్ పార్కు పేరు చెప్పి వరంగల్ నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలకు మొరం అమ్ముకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏదేమైనా ఎల్లుగ్గార్ గుట్ట చుట్టూ తవ్వకాలు చేపట్టకుండా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

జీవ వైవిధ్యానికి ప్రమాదం..



తవ్వకాలు చేపడితే పర్యావరణానికి, జీవ వైవిధ్యానికి ప్రమాదం. గుట్టపై ఎన్నో రకాల ఔషధ మొక్కలు, పండ్లు, నీడనిచ్చే చెట్లు ఉన్నాయి. దీనిపై ఎన్నో రకాల వన్యప్రాణులు జీవిస్తున్నాయి. ఇలాంటి గుట్టపై మట్టి తవ్వకాలు చేపడితే మొక్కలు, వృక్షాలు కనుమరుగయ్యే పరిస్థితి ఉంది.

- పెద్దపెల్లి రవీందర్, నర్సానగర్

మొరం తవ్వకాలు చేపట్టొద్దు..



ఎల్లుగ్గార్ గుట్టపై లక్ష్మీనర్సింహస్వామి, వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి విగ్రహాలు ఉన్నాయి. ఏడు కోనేరులున్నాయి. ప్రజలు నిత్యం పూజలు చేస్తున్నారు. దీనిని ఆధ్యాత్మిక కేంద్రంగా అభివృద్ధి చేయాలి కానీ.. తవ్వకాలు చేపట్టొద్దు. భావితరాలకు గుట్ట ప్రత్యేకతలు తెలిపే విధంగా ఉండాలి.

- బుక్క సంపత్, నర్సానగర్

క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించాలి

- కలెక్టర్ ప్రావీణ్య

ఎంజీఎం: ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి.. వ్యాధి నివారణకు కృషి చేయాలని కలెక్టర్ ప్రావీణ్య ఆదేశించారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గోపాలస్వామిగుడి నుంచి ఎంజీఎం సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ టీబీ వ్యాధి లక్షణాలు ఉన్నవారు స్వచ్ఛందంగా ముందుకొచ్చి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని కోరారు. అనంతరం క్షయ వ్యాధి నిర్మూలన కోసం కృషి చేస్తున్న ఉద్యోగులకు కలెక్టర్ చేతులమీదుగా ప్రశంస పత్రాలు, మెమొంటోలు అందించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ కె.వెంకటరమణ, టీబీ ప్రోగ్రాం జిల్లా అధికారి సుధార్‌సింగ్, డిప్యూటీ డీఎంహెచ్ఓలు డాక్టర్ గోపాల్‌రావు, డాక్టర్ ప్రకాశ్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి



నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు, ఉపాధ్యాయులు

విద్యారణ్యపురి: ప్రతి నెలా ఒకటో తేదీన వేతనాలు జమ చేయాలని, పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ హనుమకొండ, వరంగల్ జిల్లాల కమిటీల ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం సాయంత్రం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. మూడు నెలలుగా ఎయిడెడ్ ఉపాధ్యాయుల వేతనాలు పెండింగ్‌లోనే ఉన్నాయని వాపోయారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ రాష్ట్ర స్టీరింగ్ కమిటీ బాధ్యులు టి.లింగారెడ్డి, రాష్ట్ర బాధ్యులు కె.సోమశేఖర్, సన్నబోయిన తిరుపతి మాట్లాడుతూ ఉపాధ్యాయులు ప్రతినెలా 15వ తేదీ వరకు వేతనాల కోసం వేచి చూడాల్సి వస్తుందన్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, సరెండర్ లీవులు, వేతనాల సప్లిమెంటరీ బిల్లులు, జీపీఎఫ్ డబ్బులు, పెన్షన్ బిల్లులు, గ్రాట్యుటీ చెల్లింపులు ఏడు నెలలుగా ట్రెజరీల నుంచి విడుదల కావడం లేదన్నారు. ఈనెల 31వ తేదీలోపు పెండింగ్ బిల్లులన్నీ చెల్లించాలని, లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు కడారి భోగేశ్వర్, రావుల రమేష్, శ్రీనివాస్‌రెడ్డి, టీఎస్‌యూటీఎఫ్, టీపీటీఎఫ్, డీటీఎఫ్ హనుమకొండ, వరంగల్ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.సదాశివరెడ్డి, పెండెం రాజు, ఎం.రఘుపతి, కె.శ్రీనివాస్, గోవిందరావు, టి.సుదర్శనం, తాటికాయల కుమార్, జి.వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, బద్దం వెంకటరెడ్డి, యాకయ్య, సీహెచ్.రవీందర్‌రాజు, డి.కిరణ్‌కుమార్, మనోజ్‌గౌడ్, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుడుంబా తయారు చేయొద్దు


సామగ్రిని స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

ఖానాపురం: గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ మురళీధర్ అన్నారు. మండలంలోని నాజీతండా శివారు అటవీ ప్రాంతంలో గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా 900 లీటర్ల పానకాన్ని ధ్వంసం చేసి ఐదు లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై రాజేశ్వరి, హెడ్ కానిస్టేబుల్ సదానందం, జగదీశ్, సంతోశ్, స్వర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

బాలుడితో ప్రేమ.. యువతి ఆత్మహత్యాయత్నం

మహబూబాబాద్ రూరల్: బాలుడితో ప్రేమ వ్యవహారం కారణంగా.. మహబూబాబాద్ జిల్లాలో ఓ యువతి పురుగుల మందు తాగి శుక్రవారం ఆత్మహత్యకు యత్నించింది. 26 ఏళ్ల యువతి, 17 ఏళ్ల బాలుడు కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఈవిషయమై కొద్దిరోజులుగా రెండు కుటుంబాల మధ్య ఘర్షణ జరుగుతోంది. ఈక్రమంలో యువతి శుక్రవారం గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈఘటనపై పోలీసులను వివరణ కోరగా.. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు



వర్ధన్నపేట: వీధి కుక్కల దాడిలో మండలంలోని కట్ర్యాల గ్రామానికి చెందిన భూక్యా వినోదకు గాయాలయ్యాయి. వినోద శుక్రవారం వ్యవసాయ పనుల కోసం బయటకు రాగా.. వీధి కుక్కలు దాడి చేశాయి. వెంటనే ఆమెను వర్ధన్నపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా.. చికిత్స పొందుతోంది.

'గజ్జల' గ్రంథాలయం.. ప్రకృతి పరవశం!


రామేశ్వరం ఏర్పాటు చేసిన నేచురోపతి లైబ్రరీ

- అరుదైన పుస్తకాలు సేకరించి నేచురోపతి లైబ్రరీ ఏర్పాటు
- ప్రజా బాహుళ్యంలోకి ప్రకృతి వైద్య విజ్ఞాన సంపద
- పుస్తకాల ప్రదర్శనలు, పరిశోధనలు
- 29న రిటైర్డ్ ఆచార్యులు 'గజ్జల'కు కీర్తి పురస్కారం

విశ్వానికి సంబంధించిన అనంతమైన నిధి అక్కడ దాగుంది. ప్రకృతి అక్షరాల రూపంలో నిక్షిప్తమై ఉంది. ఆధునిక వైద్యానికి సైతం అందని ఎన్నో రుగ్మతలకు పరిష్కారం అక్కడ దొరుకుతుంది. ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాల భాండాగారాన్ని ఏళ్లు శ్రమించి నిర్మించిన కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరం కృషిపై 'సాక్షి' ప్రత్యేకం.

- కేయూ క్యాంపస్

కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ రిటైర్డ్ ఆచార్యులు గజ్జల రామేశ్వరం. ఆయన అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య విజ్ఞాన సంపదను సేకరించారు. మరుగున పడిపోతున్న ప్రకృతి వైద్యంపై ఉన్న మక్కువతో దేశమంతా తిరిగి అరుదైన ప్రకృతి వైద్య సాహిత్య పుస్తకాలు, జర్నల్స్‌ను సేకరించారు. ప్రకృతి వైద్య సాహిత్య ప్రదర్శనలిచ్చి ప్రజా బాహుళ్యంలోకి వెళ్లేలా కృషి చేశారు. హనుమకొండలోని ప్రకాశ్‌రెడ్డిపేటలోని బ్యాంకుకాలనీలో తన సొంత భవనంలో జాతీయ ప్రకృతి వైద్య సాహిత్య గ్రంథాలయాన్ని 2018 జులై 24న ఏర్పాటు చేశారు. ఆతర్వాత దాన్ని 2021 జులై 24న అంతర్జాతీయ ప్రకృతి వైద్య విజ్ఞాన సంపదతో అంతర్జాతీయ నేచురోపతి లైబ్రరీగా మార్చారు. గ్రంథాలయంలో ప్రస్తుతం సుమారు 5 వేలకు పైగా.. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ, మరాఠీ, ఉర్దూ, గుజరాతి కన్నడ తదితర భాషల్లో ఆయా ప్రకృతి వైద్య సాహిత్యం అందుబాటులో ఉంది. ఎవరైనా ఇక్కడికి వచ్చి అందులోని ప్రకృతి వైద్య సాహిత్యాన్ని, జర్నల్స్‌ను చదువుకునేందుకు అవకాశం కల్పించారు. ఉచిత ప్రవేశం, దూర ప్రాంతాల నుంచి వచ్చేవారికి అక్కడే రెండ్రోజులు ఉండేలా వసతి కూడా కల్పిస్తున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పాఠకులు వచ్చి చదువుకోవచ్చు. సుమారు వందేళ్ల కిందటి నేచురోపతికి సంబంధించిన పుస్తకాలు, జర్నల్స్, మాసపత్రికలు ఇక్కడి లైబ్రరీలో అందుబాటులో ఉన్నాయి.


బీఈడీ విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ..

సదస్సులు.. రికార్డులు..

అరుదైన ప్రకృతి వైద్య సాహిత్యం సేకరించిన ఆచార్య రామేశ్వరంకు 2016లో తెలుగుబుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కింది. 1990లో ముంబాయిలో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో రామేశ్వరం పాల్గొని పరిశోధన పత్రాన్ని సమర్పించారు. తెలుగులో ప్రకృతి వైద్య నిఘంటువు ఆయన రూపొందించారు. ప్రకృతి వైద్య విజ్ఞాన గ్రంథాల వివరాలను బిబ్లియోగ్రఫీ పుస్తకం రూపంలో తీసుకొచ్చిన ఘనత కూడా ఆయనదే. మహాత్మాగాంధీ అండ్ నేచురోపతి 50 సంవత్సరాల గవర్నమెంట్ అండ్ పాలిసీస్ అండ్ ప్రోగ్రామ్స్ అంశంపై న్యూఢిల్లీలో నిర్వహించిన జాతీయ సదస్సులో రామేశ్వరం సమర్పించిన పరిశోధన పత్రానికిగాను సంబంధిత అధికారుల చేతుల మీదుగా బ్రాంజ్‌మెడల్‌ను అందుకున్నారు. గతేడాది డిసెంబర్ 25న హైదరాబాద్‌లో నిర్వహించిన వాజ్‌పేయి జయంతిలో గజ్జల రామేశ్వరంనకు వాజ్‌పేయ్ ఫౌండేషన్ వారు ప్రతిభా పురస్కారం అందజేశారు.

మ్యూజియంలో పుస్తకాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడిసినల్ హెరిటేజ్ మ్యూజియంలో రామేశ్వరం సేకరించిన అరుదైన పలు పుస్తకాలను కూడా అందులో ఉంచాలని ఆసంస్థ కోరి కొంత స్థలాన్ని కేటాయించడంతో ఆయన అక్కడి మ్యూజియంలో కొన్ని పుస్తకాలు అందుబాటులో ఉంచారు.

కీర్తి పురస్కారం

వివిధ రంగాల్లో కృషి చేస్తున్న వారికి హైదరాబాద్‌లోని పొట్టిశ్రీరాములు తెలుగు యూనివర్సిటీ కీర్తి పురస్కారానికి రిటైర్డ్ ప్రొఫెసర్ గజ్జల రామేశ్వరంను ఎంపిక చేసింది. ఈమేరకు గురువారం రాత్రి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్ ప్రకటించారు. ప్రకృతి వైద్య సాహిత్య సేకరణ, లైబ్రరీ ఏర్పాటు, ప్రకృతి వైద్యంలో పరిశోధనలకు గాను ఆ యూనివర్సిటీ కీర్తి పురస్కారాన్ని అందించనుంది. ఈనెల 29న రామేశ్వరం ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు.

విశ్వవ్యాప్తం చేయాలనే తపన



మరుగున పడిపోతున్న ప్రకృతి వైద్య విధానాన్ని ప్రజా బాహుళ్యంలోకి విశ్వవ్యాప్తం చేయాలనేది నా తపన. అందుకే ఎన్నో వ్యయ ప్రయాసాలకు ఓర్చి సేకరించిన అరుదైన పుస్తకాలు, జర్నల్స్‌తో లైబ్రరీని ఏర్పాటు చేశాను. కీర్తి పురస్కారం లభించడం సంతోషంగా ఉంది. గ్రంథాలయం ప్రకృతి వైద్య పరిశోధకులకు ఎంతో ఉపయోగపడుతుంది. అందరూ వినియోగించుకోవాలి.

- గజ్జల రామేశ్వరం, రిటైర్డ్ ఆచార్యులు

వరకట్న వేధింపులకు వివాహిత బలి

- మృతురాలు నాలుగు నెలల గర్భవతి


మృతి చెందిన సాయిప్రత్యూష

మరిపెడ రూరల్: అత్తింటి కట్నం వేధింపులకు ఓ వివాహిత బలైంది. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం లక్ష్మాతండా గ్రామ పంచాయతీ పరిధి జామ్లా తండాకు చెందిన సాయి ప్రత్యూష(23) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. జామ్లా తండాకు చెందిన బానోతు మహేశ్‌కు ఖమ్మం జిల్లా తిరుమలయపాలెం మండలం జోగులపాడు గ్రామానికి చెందిన సాయిప్రత్యూష ప్రేమించి మూడేళ్లక్రితం వివాహం చేసుకున్నారు. వివాహ సమయంలో కట్న కానుకల కింద బంగారం, సుమారు రూ.లక్ష ఇచ్చారు. వీరికి 18 నెలల పాప ఉంది. మహేశ్ వ్యవసాయ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవలి కాలంలో అదనపు కట్నం కోసం భార్యభర్తల మధ్య గొడవలు జరుగుతున్నాయి. పలుమార్లు తండా పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ పెట్టారు. అయినప్పటికీ గొడవలు సర్దుమణగలేదు. దీంతో భర్తతో పాటు అత్త, మామ వేధింపులు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలో మరోసారి ఇంట్లో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. గురువారం రాత్రి సాయి ప్రత్యూష ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హుటాహుటిన ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. ప్రస్తుతం సాయిప్రత్యూష నాలుగు నెలల గర్భవతిగా అక్కడి వైద్యులు గుర్తించినట్లు తెలుస్తోంది. మృతురాలి తండ్రి దరావత్ రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పట్టు పరిశ్రమకు తెలంగాణ అనుకూలం

- సెంట్రల్ సిల్క్ బోర్డు సభ్యురాలు డాక్టర్ భాగ్య
- 300 మంది రైతులకు అవగాహన

జనగామ రూరల్: పట్టు పరిశ్రమకు తెలంగాణ నేలలు అనుకూలమని, ఈ పరిశ్రమపై రైతులు దృష్టి సారించాలని సెంట్రల్ సిల్క్ బోర్డ్ సభ్యురాలు డాక్టర్ భాగ్య అన్నారు. శుక్రవారం జనగామ మండలం పెంబర్తిలోని శివం ఫంక్షన్ హాల్‌లో ప్రాంతీయ పట్టు పరిశోధన కేంద్రం, సెంట్రల్ సిల్క్ బోర్డ్ ఆధ్వర్యంలో సిరిసిల్ల, సిద్దిపేట, భువనగిరి, ములుగు, మహబూబాబాద్, జనగామ, నల్లగొండ, సూర్యాపేట, నిర్మల్, మంచిర్యాల, వరంగల్, హనుమకొండ, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలకు చెందిన 300 మంది రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా డాక్టర్ భాగ్య జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. పట్టు పరిశ్రమల వల్ల ఎకరానికి రూ.3 నుంచి రూ.4 లక్షల ఆదాయం వస్తోందన్నారు. రాష్ట్రంలో 15,679 ఎకరాల్లో 6 వేల మందికి పైగా రైతులు మల్బరీ సాగు చేస్తున్నట్లు తెలిపారు. ఎక్కువగా దిగుబడినిస్తున్న బైవోల్టిన్ పట్టు పురుగులను రైతులు పెంచుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. రైతులకు బిందు సేద్యం వసతి కల్పిస్తున్నారని, రైతులు పట్టు పురుగుల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. జనగామ జిల్లాకు కేంద్రం మల్బరీ గుడ్ల ఉత్పత్తి కేంద్రాన్ని మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో సెంట్రల్ బోర్డు శాస్త్రవేత్తలు, వినోద్ యాదవ్, మీనాక్షి, బీటీ శ్రీనివాస్, మొగిలి, హార్టికల్చర్ అధికారి లత, వివిధ జిల్లాల నుంచి అధికారులు, రైతులు పాల్గొన్నారు.


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సెంట్రల్ బోర్డు సభ్యురాలు భాగ్య, అధికారులు

కూచిపూడి గురువు పద్మజ కన్నుమూత


కుప్పా పద్మజ (ఫైల్)

హన్మకొండ కల్చరల్ : ప్రముఖ కూచిపూడి నాట్య గురువు కుప్పా పద్మజ (56) గుండెపోటుతో ఓ సిటిలోని ఆమె స్వగృహంలో గురువారం రాత్రి కన్నుమూశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న పద్మజ గురువారం సాయంత్రం 7 గంటల వరకు విధుల్లో ఉన్నారు. ఆమె మరణ వార్త వినగానే సంగీత కళాశాల సిబ్బంది, వరంగల్ ఉమ్మడి జిల్లాలోని సంగీత, నృత్యకళాకారులు, శిష్యబృందం, గురువులు, ప్రముఖులు దిగ్భ్రాంతి చెందారు. పద్మజ ఐదేళ్ల వయస్సు నుంచి నాట్యం నేర్చుకున్నారు. వెంపటి వెంకటనారాయణ కాకతీయ నృత్య కళాక్షేత్రం నిర్వాహకురాలు వెంపటి నాగేశ్వరి వద్ద నృత్యం నేర్చుకున్నారు. 1992లో విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాలలో అసిస్టెంట్ లెక్చరర్‌గా చేరారు. 2014 నుంచి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా ఐదేళ్లు బాధ్యతలు నిర్వర్తించారు. న్యూఢిల్లీ దూరదర్శన్ కేంద్రం నుండి 'ఏ' గ్రేడ్ కూచిపూడి నాట్య కళాకారిణిగా గుర్తింపు పొందారు. మానవ వనరుల అభివృద్ధి శాఖచే జూనియర్ ఫెలోషిప్, తెలంగాణ ప్రభుత్వంచే ఉత్తమ నాట్యకారిణిగా అవార్డు 2015లో అందుకున్నారు. మరెన్నో రాష్ట్ర, జాతీయ స్థాయిలో అవార్డులు అందుకున్నారు. నృత్యనాటికలకు దర్శకత్వం వహించారు. వివిధ రాష్ట్రాల్లో, ఇతర దేశాల్లో 500లకు పైగా నృత్య ప్రదర్శనలిచ్చారు.

ప్రముఖుల సంతాపం

పద్మజ మరణం తీరని లోటు అని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ భట్టు రమేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జానపద, గిరిజన విజ్ఞాన పీఠం పీఠాధిపతి డాక్టర్ గడ్డం వెంకన్న మాట్లాడుతూ.. కుప్పా పద్మజ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో ఆరేళ్లుగా నృత్యంలో పీహెచ్‌డీ సీటు కోసం ప్రయత్నించారని, పీహెచ్‌డీ చేయాలనే చిరకాల కోరిక తీరకుండానే వెళ్లిపోయారని గుర్తు చేశారు. విద్యారణ్య ప్రభుత్వ సంగీత కళాశాల ప్రిన్సిపాల్ సుధీర్‌కుమార్, అధ్యాపకులు ఏడిద భీంశంకర్, జక్కోజు సత్యనారాయణ, భాస్కర్‌రావు, అనుమూల యోషా, సీనియర్ అసిస్టెంట్ గడ్డం శంకర్, పేరిణి నృత్యగురువులు గజ్జెల రంజిత్‌కుమార్, నవ్యజ, ఓరుగల్లు శారద నాట్య మండలి సభ్యులు జీఎస్ శర్మ, జూలూరి నాగరాజు, వివిధ నృత్య కళా క్షేత్రాల గురువులు సంతాపం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



గోపాలస్వామి(ఫైల్)

లింగాలఘణపురం: రోడ్డు ప్రమాదంలో మండలంలోని నెల్లుట్లకు చెందిన ఉపాధ్యాయుడు సంబోజు గోపాలస్వామి(56) శుక్రవారం మృతి చెందాడు. గోపాలస్వామి జనగామలో ఉంటూ.. మండలంలోని కిష్టగూడెం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఏడు గంటలకు ద్విచక్రవాహనంపై కిష్టగూడెం పాఠశాలకు బయల్దేరాడు. నెల్లుట్ల వద్ద బ్రిడ్జి దిగుతుండగా.. కుక్క ఎదురుగా రావడంతో ఒక్కసారిగా ముందు బ్రేక్ సడన్‌గా వేయడంతో ఎగిరి రోడ్డుపై పడ్డాడు. హెల్మెట్ ఉన్నప్పటికీ తలకు, కడుపులో బలమైన గాయాలు కావడంతో 108లో జనగామ ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన మృతిపై మండలంలోని ఉపాధ్యాయులు తీవ్ర దిగ్భ్రాంతి చెందారు. కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎంఈఓ చంద్రారెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.

దాచుకున్న డబ్బులు దోచుకున్నారు..

నల్లబెల్లి: గొర్రెలను అమ్మగా వచ్చిన డబ్బులను ఇంట్లో దాచుకోగా.. గుర్తు తెలియని వ్యక్తులు దోచుకున్నారు. మండలంలోని రుద్రగూడెం గొల్లవాడకు చెందిన మేరుగు శ్రీకాంత్ ఇటీవల తనకున్న గొర్రెలను విక్రయించాడు. జీవనోపాధి కోసం టవేరా వాహనాన్ని ఇటీవల కొనుగోలు చేశాడు. గొర్రెలను అమ్మగా వచ్చిన డబ్బులను వాహనం అప్పు తీర్చాలనుకున్నాడు. గొర్రెలను కొన్న వ్యక్తి శుక్రవారం శ్రీకాంత్ వద్దకు వచ్చి నగదు ఇవ్వడంతో ఇంట్లో దాచిపెట్టాడు. పనుల నిమిత్తం బయటకు వెళ్లాడు. పనులు ముగించుకుని ఇంటికి రాగా.. తలుపులు తీసి ఉండడంతో అనుమానంతో ఇంట్లో డబ్బులను చూడగా.. రూ.50 వేలు, తులంన్నర బంగారం చోరీకి గురైనట్లు గుర్తించారు. ఈమేరకు పోలీసులకు సమాచారం అందించగా.. క్లూస్ టీం బాధితుడి ఇంటికి చేరుకుని వేలిముద్రలు సేకరించారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య


శ్రీధర్(ఫైల్)

ఐనవోలు: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెందిన మండలంలోని వెంకటాపూర్‌కు చెందిన రైతు కాసుగొండ శ్రీధర్(34) శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పురుగుల మందు తాగిన విషయం గమనించిన శ్రీధర్ భార్య లక్ష్మి అతడిని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తీసుకెళ్లింది. చికిత్స పొందుతున్న అతడు మృతి చెందాడు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు జఫర్‌గఢ్ ఎస్సై మాధవ్‌గౌడ్ తెలిపారు.

ఆహార ధాన్యాల కృత్రిమ కొరత సృష్టించొద్దు

- హనుమకొండ అదనపు కలెక్టర్ సంధ్యారాణి


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: ఆహార ధాన్యాలను అక్రమంగా నిల్వచేస్తూ కృత్రిమ కొరత సృష్టించవద్దని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ధరల నియంత్రణపై సమీక్ష కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యాపారస్తులు, అధికారులతో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గత నెలకు, ప్రసుత్త నెలకు వస్తువుల డిమాండ్ పెరుగుదల పరిశీలించాలన్నారు. డిమాండ్ ఉన్న వస్తువులు క్రమంగా నిల్వచేసి ధరలు పెంచే విధంగా వ్యాపారస్తులు చేయవద్దని ఆదేశించారు. అలాంటి వారిపై అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. సమావేశంలో డీఎస్ఓ వసంతలక్ష్మి, డీఎస్పీ రాజు, డీఎంసీఎస్ మహేందర్, తూనికలు కొలతలు అధికారి అనిల్‌కుమార్, వ్యవసాయ అధికారి మురళీమోహన్, రైతు బజార్ అధికారి షఫీయుద్దీన్, డీటీసీఎస్‌లు కృష్ణ, సత్యనారాయణ, ఇతర వ్యాపార సంస్థల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు,


కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ధర్నా


అదనపు కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్ రూరల్: జిల్లాలో ఇటీవల కురిసిన వడగళ్లతో వానతో దెబ్బతిన్న పంటలకు ఎకరానికి రూ.20వేల చొప్పున తక్షణ సాయంగా ప్రకటించాలని అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎస్) జిల్లా నాయకుడు రాచర్ల బాలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ ఎదుట వివిధ రైతు సంఘాల నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. అనంతరం బాలరాజు మాట్లాడుతూ నష్టపోయిన పంటలకు ప్రభుత్వాలు సమగ్ర పంటల బీమా పథకం వర్తింపజేయాలన్నారు. ముఖ్యమంత్రి గురువారం ఎకరానికి రూ.10వేల చొప్పున ఇస్తామని ప్రకటించారని, అయితే రైతులు ఎకరానికి రూ.20వేల నుంచి రూ.25వేల వరకు పెట్టుబడి పెట్టారన్నారు. సీఎం ప్రకటించిన రూ.10వేలు ఎందుకు సరిపోతాయని ఆయన ప్రశ్నించారు. రైతుల పంటలకు బీమా చేయించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. అఖిల భారత రైతుకూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు సుదమల్ల భాస్కర్ మాట్లాడుతూ రుణమాఫీ పథకం అనేది రాష్ట్రంలో ప్రహసనంగా మారిందన్నారు. ధర్నాలో పాల్గొన్న రైతు సంఘాల నాయకులు రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతువ్యతిరేక విధానాలపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఏఐకేఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వీరగోని శంకరయ్య, తెలంగాణ రైతు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సోమిడి శ్రీనివాస్, సంయుక్త కిసాన్ మహాసభ జిల్లా అధ్యక్షుడు వల్లందాసు కుమార్, ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు ఎండి.ఇస్మాయిల్, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, నాయకులు ప్రభాకర్, వెంకటేశ్వరరావు, రాజేందర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా అప్పారావు, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకుడు బండి కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ బీజేపీని తీసుకెళ్లాలి

- బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ

హన్మకొండ: కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. శుక్రవారం హనుమకొండ దీన్‌దయాల్ నగర్‌లోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన ఓబీసీ మోర్చా జిల్లా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఏప్రిల్ 6 నుంచి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించే గ్రామ గ్రామానికి ఓబీసీ... గడపగడపకూ బీజేపీలో మోదీ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూడా బీసీ సారథ్యంలోనే పార్టీ ముందుకు సాగుతోందన్నారు. రాబోయే ఎన్నికల్లో ఓబీసీలు బీజేపీకి అండగా నిలువాలన్నారు. ఓబీసీ జిల్లా అధ్యక్షుడు నాంపల్లి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు బెజ్జంకి పూర్ణాచారి, గాజుల సంపత్, నాయకులు బాసాని సోమరాజు, గడప శివ, నర్మెట్ట శ్రీనివాస్, సంతోష్, గీల సురేష్, నాగవెల్లి గోపి, నవీన్, తిలక్, బండి సదానందం పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల ప్రక్రియ

వరంగల్ లీగల్: వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ ఎన్నికలు ఈనెల 31న జరగనున్నాయి. శుక్రవారం అంబేడ్కర్ హాల్‌లో మధ్యాహ్నం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం గడువు ముగిసింది. శనివారం అభ్యర్థుల ఉప సంహరణ కార్యక్రమం ముగియడంతో సాయంత్రం పోటీల్లో ఉన్న అభ్యర్థుల జాబితాను వెల్లడించనున్నారు. ఏకగ్రీవంగా కిరణ్‌సింగ్, విష్ణుకుమార్‌గుప్తా, పద్మలత గౌడ్ నియమితులు కాగా.. నామినేషన్ వేసిన వారిలో ప్రెసిడెంట్‌గా యం.రమేశ్‌బాబు, పి.సత్యనారాయణ, వై.శ్యాంసుందర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్‌గా డి.దయానశ్రీనివాసన్, ఎన్.నరేందర్ తదితరులున్నారు.